

మల్యాల మండలం నూకపల్లి కేసీఆర్ కాలనీలో డబుల్ బెడ్రూం ఇంటిని ప్రారంభించిన అనంతరం మంత్రి కేటీఆర్‌కు స్వీటు అందజేస్తున్న అంకం జ్యోత్స్న కుటుంబసభ్యులు



ధర్మపురిలో బహిరంగ సభకు హాజరైన మహిళలు




జగిత్యాల: మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, సుంకె రవిశంకర్, చీఫ్ విప్ భానుప్రసాద్ రావు, విప్ బాల్క సుమన్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశం గౌడ్, ఎమ్మెల్సీరమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, కోరుట్ల బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, తదితరులు



జగిత్యాలలో పోలీస్ ప్రధాన కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



జగిత్యాలలో సమీకృత మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్



జగిత్యాల మినీ స్టేడియంలో డబుల్‌బెడ్రూం లబ్ధిదారురాలికి ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చిత్రంలో ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సుంకె రవిశంకర్, కలెక్టర్ యాస్మిన్ బాషా



ధర్మపురి: మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీరమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తమ్మ

### ఈశ్వరన్నను 50 వేలకుపైగా మెజార్టీతో గెలిపించండి

మా కొప్పుల ఈశ్వరన్న ధర్మపురి ధర్మరాజు. మృధుస్వభావి. చాలా సౌమ్యుడు. ఒక పేద కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో మంత్రిగా ఎదగడం చాలా గొప్ప విషయం. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచి రాజకీయాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగారు. ఈశ్వరన్నకు నేను పెద్ద అభిమానిని. ఆయన కృషితోనే ధర్మపురి పట్టణం ఎనలేని అభివృద్ధి సాధించింది. ధర్మపురి పేరులోనే ధర్మమున్నది. రానున్న ఎన్నికల్లో ధర్మపురిలో ఈశ్వరన్నను 50వేల మెజార్టీతో గెలిపిస్తేనే ధర్మమున్నట్టు. లేకపోతే ధర్మం లేనట్టే. ధర్మపురి నుంచి గెలిచి మొదటి సారి ప్రభుత్వ విప్‌గా పనిచేసినపుడే కోట్లాది రూపాయలు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. ఇప్పుడు మంత్రిగా ధర్మపురిని మున్సిపాలిటీ చేసి అభివృద్ధి చేస్తున్నారు. ఇదివరకు ఇచ్చిన ₹45కోట్ల మున్సిపల్ నిధులతో ధర్మపురి ఎంతో అభివృద్ధి సాధించింది. ఈశ్వరన్న కోరకున్నా ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి ఫిదా అయినా. మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ధర్మపురి పట్టణానికి మరో ₹25 కోట్లు మంజూరు చేస్తున్నా.

**- మంత్రి కేటీఆర్**

# జయహో కేటీఆర్




## ప్రగతి సారథి రామన్నకు బ్రహ్మరథం

- జగిత్యాల, ధర్మపురి బహిరంగ సభలు సూపర్ సక్సెస్
- రెండు నియోజకవర్గాల నుంచి కదిలిన పల్లెలు
- వేలాదిగా తరలివచ్చిన జనం.. కిక్కిరిసిన మైదనాలు
- జోష్ నింపిన అమాత్యుడి ప్రసంగం
- అభ్యర్థులు కొప్పుల ఈశ్వర్, డాక్టర్ సంజయ్‌పై ప్రశంసల వర్షం
- భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి • శ్రేణుల్లో నయా జోష్

జగిత్యాల/కరీంనగర్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ)/ ధర్మపురి: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్‌కు జగిత్యాల జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హోంమంత్రి మహమూద్‌అలీ, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ, దివ్యాంగ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మంగళవారం జగిత్యాల, ధర్మపురిలో పర్యటించగా, ఆయా చోట్ల నీరాజనం పలికారు. ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు నియోజకవర్గాల నలుమూలల నుంచి వేలాదిగా జనం తరలివచ్చారు. జగిత్యాలలో ఉదయం 9 గంటల నుంచే ఆటోలు, బైకులు, బస్సుల్లో చేరుకున్నారు. పలు కుల సంఘాల నాయకులు చేతివృత్తులను ప్రదర్శిస్తూ, మేళాతాళాలతో అట్టహాసంగా సభాస్థలికి చేరుకున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు, కుల సంఘాల నాయకులు, డ్వాక్రా మహిళలు, పెద్ద సంఖ్యలో కదిలివచ్చారు. ధర్మపురిలోనూ స్వచ్ఛందంగా సభకు వచ్చారు. మధ్యాహ్నం 12.15 గంటలకు జగిత్యాల వివేకానంద మినీ స్టేడియంలో ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరు సంజయ్ అధ్యక్షతన, మధ్యాహ్నం 2.55 గంటలకు ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంత్రి కొప్పుల ఈశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు అమాత్యుడు రామన్న హాజరయ్యారు. ఆయాచోట్ల కేటీఆర్ వేదికలపైకి చేరుకున్న సమయంలో ఒక్కసారిగా జనం కేరింతలు కొట్టారు. పెద్దపెట్టున కరతాళ ధ్వనులు చేశారు. జగిత్యాలలో 38 నిమిషాలు, ధర్మపురిలో 35 నిమిషాలపాటు తన ప్రసంగంతో ఉర్రూతలూగించారు. చెణుకులు, సామెతలతో తనదైన శైలిలో విపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజల కోసం తపన, జరిగిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలు, వెచ్చిస్తున్న నిధులు, కలుగుతున్న లబ్ధిని విడమరిచి చెప్పారు. బీజేపీ కులమత విద్వేషపూరిత రాజకీయాలు, కాంగ్రెస్ కుటిల నీతి, తప్పుడు ప్రచారాన్ని ఎండగడుతూనే.. తొమ్మిదేండ్లలో కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని అర్థమయ్యేలా ఏకరువుపెట్టారు. మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై మంత్రి రామన్న ప్రశంసల జల్లు కురిపించారు. ఇద్దరూ తమ నియోజకవర్గాల అభివృద్ధికి చేసిన కృషిని వివరిస్తూనే.. మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయాచోట్ల అమాత్యుడు రామన్న ప్రసంగిస్తున్నంతసేపూ సభికులు హర్షధ్వానాలతో జేజేలు పలికారు. 'జై కేసీఆర్' 'జై కేటీఆర్' నినాదాలతో హోరెత్తించారు. సభలు సక్సెస్ కావడం గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలిరావడంతో నయాజోష్ కనిపించింది.

## ప్రారంభోత్సవాలు.. పేదలకు పట్టాలు

మంత్రి కేటీఆర్, హోం మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ, దివ్యాంగ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి జగిత్యాల, ధర్మపురిలో పర్యటించారు. ₹573 కోట్లతో నిర్మించిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా జగిత్యాలకు చేరుకున్న ఆయన, నూకపెల్లి వద్ద కేసీఆర్ కాలనీలో ₹280 కోట్లతో నిర్మించిన 4,520 డబుల్ బెడ్రూం ఇండ్లు, ₹40 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, ₹4.50 కోట్లతో నిర్మించిన మార్కెట్ యార్డు ఆవరణలో సమీకృత కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. అనంతరం వివేకానంద మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు. వేదికపై డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం 2.25 గంటలకు హెలీకాప్టర్‌లో ధర్మపురికి చేరుకున్నారు. ₹8.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ₹247.86 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాల పైలాన్‌ను ఆవిష్కరించారు. ధర్మపురి జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు జంబో ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఇదే వేదిక పై నుంచి వెల్గటూర్ మండలంలో ₹60కోట్లతో నిర్మించే అగ్రికల్చర్ డిగ్రీ కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 4.20 గంటలకు బహిరంగ సభను ముగించుకొని, హెలీకాప్టర్ లోరాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లారు.



మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ధర్మపురి: మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, చిత్రంలో విప్ బాల్కసుమన్, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేతకాని



ధర్మపురి: పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్



ప్లకార్డులు పట్టుకొని ధర్మపురి సభకు వస్తున్న నియోజకవర్గ ప్రజలు

### సంజయ్‌ను 75 వేల మెజార్టీతో గెలిపించండి

'కాంగ్రెస్ అంటే గతం. దాని పని ఏనాడో ఖతమైపోయింది. జీవన్‌రెడ్డి జగిత్యాల ప్రజలకు గతం లాంటి వారు. భవిష్యత్తు అంటే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాత్రమే. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరినట్లు జగిత్యాల పట్టణంలో రైతులకు ఇబ్బందులు లేకుండా పట్టణ ప్రణాళికను రూపొందిస్తాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను రూపొందిస్తాం. వరి ఉత్పత్తి జగిత్యాల ప్రాంతంలో విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రోజుకు వెయ్యి క్వింటాళ్ల ధాన్యం మరాడించే పరిశ్రమస్థాపనకు కృషి చేస్తాం. జగిత్యాల ప్రాంతం మామిడి పంటకు ప్రసిద్ధి. మామిడి రైతుల కోసం పెప్సీ లేదా కోకాకోలా కంపెనీల్లో ఏదో ఒక్కదాన్ని ఇక్కడికి తీసుకువస్తా. ₹50 కోట్లతో మరో వెయ్యి డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం సైతం చేపడుతాం. మీరు జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్‌ను 75వేల మెజార్టీతో గెలిపించే బాధ్యత మీరు తీసుకోండి. ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామి తీర్చిదిద్దే బాధ్యతను నేను తీసుకుంటా. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి కోసం అడిగిన ప్రతి పనిని మంజూరు చేస్తా..సమస్యలన్నీ పరిష్కరిస్తా.

**- మంత్రి కేటీఆర్**



ధర్మపురి మాతాశిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణితో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్



జగిత్యాల మినీస్టేడియంలో బహిరంగ సభకు అశేషంగా హాజరైన జనం



జగిత్యాల నూతన పోలీస్ కార్యాలయంలో మంత్రులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ భాస్కర్, చిత్రంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్



జగిత్యాల సమీకృత మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్న మహిళకు ఆప్యాయంగా పలుకరింపు